మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# క్యాన్సర్ వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలి

### నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణ పేట, అక్టోబరు 24 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాకోస్గి పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. క్యాన్సర్ వ్యాధి నివారణకు తగిన చర్యల్లుతీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులు క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించేందుకు ఆరోగ్య విద్య కౌన్సెలింగ్ నిర్వహించారు. మహిళలకు పాప్ స్మియర్ క్లినికల్ బ్రెస్ట్ ఎగ్జామినేషన్, మామోగ్రఫీ అల్ట్రాసౌండ్ మెడ అల్ట్రాసౌండ్ ఉదరం పెల్విస్ సోనో మామోగ్రఫీ డిజిటల్ ఎక్స్‌రే ఛాతీ నోటి పరీక్షలు వంటి సేవలు అందించారు. క్యాన్సర్ వ్యాధిని ముందుగానే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని క్యాన్సర్ స్క్రీనింగ్ ఆరోగ్య రక్షణలో కీలకమని కలెక్టర్ తెలిపారు. ఎలాంటి లక్షణాలు లేకపోయినా స్క్రీనింగ్ ద్వారా వ్యాధిని ముందస్తుగా గుర్తించవచ్చని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ శిబిరంలో మొత్తం 326 మంది క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోగా వారిలో 220 మహిళలు 106 మంది పురుషులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ డాక్టర్లు డా.మల్లికార్జున్, డీఎంహెచ్ఓ జయచంద్రమోహన్, డా.అనుదీప్, తహసీల్దార్ బక్క శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీధర్, వైద్యులు అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్



ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్

### యుద్ధ ప్రాతిపదికన

# ఈ కేవైసీ పూర్తి చేయాలి

- ఈ కేవైసీ నిర్వహించడంలో వెనుకబడిన కొత్తకోట ఎంపీడీవో ఏపీవోకు షోకాజ్
- అన్ని మండలాల ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, అక్టోబరు 24 ప్రభాతవార్త:** ఉపాధి హామీ పథకంలో శ్రామికులందరికీ ఈ కేవైసీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ డిఆర్‌డిఓ ఉమాదేవి తో కలిసి అన్ని మండలాల ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో శ్రామికులందరికీ ఈ కేవైసీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే సోమవారం నాటికి ఈ కేవైసీ పూర్తి చేసేందుకు గడువు ఉందని, ఆలోగా అన్ని మండలాల వారీగా ఉపాధి హామీ శ్రామికులందరికీ ఈ కేవైసీ పూర్తిచేయాలని సూచించారు. ఈ కేవైసీ నిర్వహించడంలో వెనుకబడిన కొత్తకోట ఎంపీడీవో ఏపీవోకు షోకాజ్‌నోటిసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి గ్రామాల వారీగా మంజూరి పత్రాలు అందుకుని ఇంకా గ్రౌండ్ చేయని – మిగతా3లో..



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే టి.ఆర్.ఆర్

### ప్రజా సంక్షేమమే

# కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి

**గండీడ్ అక్టోబర్ 24, ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని,ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, అర్హులకు సంక్షేమ ఫలాలను అందజేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు.గండీడ్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గండీడ్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 24 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.24,02,784 చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం జంగం రెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్నారు. రెడ్డిపల్లి గ్రామంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు.వెన్న జెడ్‌మోడల్ స్కూల్లో ఖగోళ విజ్ఞాన ప్రయోగశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ఆర్.ఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. ఎన్నికల్లో – మిగతా3లో..



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

### మోడల్ సోలార్ విలేజ్‌గా


# మరికల్ ఎంపిక

**నారాయణ పేట, అక్టోబరు 24 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా మరికల్ మండలంలోని సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద మోడల్ సోలార్ విలేజ్‌గా ఎంపికైనట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మోడల్ సోలార్ విలేజ్ స్కీమ్‌పై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ చాంబర్లో నిర్వహించబడింది. ఈ సమావేశంలో మరికల్ గ్రామాన్ని జిల్లాలోని మోడల్ సోలార్ విలేజ్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని ప్రతి జిల్లాలో ఒక మోడల్ సోలార్ గ్రామాన్ని సృష్టించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మార్గదర్శకాల ప్రకారం ఎంపికకు అర్హత పొందాలంటే తాజా జనాభా లెక్కల ప్రకారం 5000 మందికి పైగా జనాభా కలిగిన రెవెన్యూ గ్రామం అయి ఉండాలని వివరించారు. జిల్లాలోని 5000 మందికి పైగా జనాభా కలిగిన 9 గ్రామాలు పోటీల్లో పాల్గొన్నాయని వాటిలో మరికల్ గ్రామం మండలం గరిష్టంగా సౌర విద్యుత్ సామర్థ్యాన్ని సాధించడంతో మోడల్ సోలార్ – మిగతా3లో..

# అంతర్యుద్ధం

## జడ్చర్ల కాంగ్రెస్‌లో కయ్యం

- జడ్చర్ల కాంగ్రెస్‌లో జగడాలు
- సొంత పార్టీలోనే విభేదాలు
- ఒకరిపై ఒకరు విమర్శలు
- మొన్న ధారా భాస్కర్, నిన్న కత్తెర కృష్ణయ్య
- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సోదరుడిపై తిరుగుబాటు
- దుష్యంత్‌రెడ్డిపై యుద్ధం ప్రకటించిన నేతలు



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్24, ప్రభాతవార్త:** జడ్చర్ల కాంగ్రెస్‌లో కయ్యం మొదలయింది. మొన్నటిదాకా అంతర్గతంగానే విమర్శలు, విభేదాలు ఉన్న పార్టీలో అంతర్యుద్ధం ఆరంభమైంది. అందుకు ప్రధాన కారణంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి సోదరుడు దుష్యంత్ రెడ్డి కావడం మరింత చర్చనీయాంశమైంది. రెండు రోజుల కింద టీపీసీసీ కోఆర్డినేటర్ ధారా బాస్కర్ బహిరంగంగానే ఎమ్మెల్యే సోదరుడు దుష్యంత్ రెడ్డి భూ ఆక్రమణలు ఆగడాలపై విమర్శలు చేసి, తనను మానసికంగా వేధిస్తున్నారని తెలిపిన సంగతి తెలిసిందే.. అదే బాటలో రాజాపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తెర కృష్ణయ్య మరో అడుగు ముందుకేసి తనపై పార్టీపై విమర్శలు చేసి పార్టీ లైన్ దాటాడు అంటూ ఏకంగా పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ లేఖను విడుదల చేయడం హాట్ టాపిక్‌గా మారింది.

### మాటల యుద్ధం..

కాంగ్రెస్‌పార్టీలో అంతర్గత విభేదాలు,ముఖ్యంగా నాయకుల మధ్య మాటల యుద్ధాలు జరుగుతున్నాయి. ఇది పార్టీలోని గ్రూపు రాజకీయాలకు, అధికారం కోసం జరిగే పోరాటాలకు దారితీస్తున్నట్లు తెలుస్తున్నది. తెలంగాణలో, మంత్రుల మధ్య విభేదాలు ఇటీవల కాలంలో స్పష్టంగా కనిపించగా, ఇది పార్టీకి కొత్త తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లాతోపాటు జడ్చర్ల నియోజకవర్గంలో పార్టీ నాయకులు ఒకరిపై ఒకరు చేసే వ్యాఖ్యలు బహిరంగంగా జరుగుతున్నాయి. ఇది పార్టీలో అంతర్గత ఘర్షణలను సూచిస్తుంది. గ్రూపు రాజకీయాలు అధికారం కోసం కొందరు నాయకులు వర్గాలను ఏర్పరుచుకుంటున్నారు, ఇది పార్టీ కార్యకర్తలకు ఇబ్బంది కలిగించే వ్యవహారంగా చెప్పవచ్చు, క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు, నాయకులు మాత్రం ఎటు తేల్చుకోలేని అయోమయంలో పడుతున్నారు.

### నాకు ప్రాణహాని ఉంది..

ఎమ్మెల్యే సోదరుడు దుష్యంత్ రెడ్డి తనను వ్యక్తిగతంగా విమర్శించడం దూషించడం, లేనిపోని ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసం. నేను ఇప్పటికే చాలా ఓపిక పట్టాను. పార్టీ లైన్ దాటి దుష్యంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారు.ఒక బీసీబిడ్డను అని కూడా చూడకుండా నా ఎదుగుదలకు అడ్డుపడుతున్నారు. నాకు ఏ హాని జరిగినా అందుకు కారణం దుష్యంతురెడ్డి కుటుంబసభ్యులే.ఇదే విషయమై నేను ఎస్పీ జానకిగారికి లేఖను కూడా సమర్పించాను. కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక విధా నాలకు పాల్పడుతున్నందునే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు లేకను విడుదల చేశాను.

**- కే కృష్ణయ్య యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, రాజాపూర్**

### దుష్యంత్‌రెడ్డిపై..

నవాబుపేట మండలంలో భూ వివాదాలకు సంబంధించి ఆక్రమణలకు సంబంధించి జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి సోదరుడు దుష్యంతు రెడ్డి కొన్ని సెటిల్మెంట్లకు తెర లేపారని కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేశారు. నియోజకవర్గంలో అక్రమ ఇసుక రవాణా వెనక, జడ్చర్ల పట్టణం నడిబొడ్డున మినీ ట్యాంక్ బండ్ నల్లకుంట వద్ద భూ కబ్జాలకు పాల్పడ్డారని పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో దుష్యంత్ రెడ్డి జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఇసుక రవాణాకు సంబంధించి మినీ ట్యాంక్ బండ్ వద్ద భూ అక్రమనకు సంబంధించి తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. ఇదే క్రమంలో పార్టీకి వ్యతిరే కంగా పని చేసిన మాట్లాడిన భూ అక్ర మణలకు పాల్పడ్డా ఇసుక అక్రమ రవాణాలో అవినీతిలో పాలుపంచుకున్న సొంత కుటుంబ సభ్యులు ఉన్నా సరే తాను వదిలేది లేదని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ప్రకటించారు. అయితే ఎమ్మెల్యే ఓవైపు ప్రకటనలు చేస్తున్న మరోవైపు ఇలా రోజుకో వ్యవహారం, విభేదాలు బయటికి రావడంతో జడ్చర్ల నియోజక వర్గంలో – మిగతా3లో..



సమీప గ్రామస్తులతో ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న మంత్రి జూపల్లి, అలంపూర్ ఎమ్మెల్యే విజయులు, కలెక్టర్ సంతోష్

### బస్సు ప్రమాద బాధిత కుటుంబాలను

# ఆదుకుంటాం

### రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**గద్వాల టౌన్ అక్టోబర్ 24, ప్రభాతవార్త:** కర్నూలు జిల్లాలో జరిగిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు ప్రమాదంలో మృతి చెందిన, గాయపడ్డ తెలంగాణ ప్రాంతానికి చెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుందని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.శుక్రవారం ప్రమాద ఘటనా స్థలాన్ని జోగులాంబ గద్వాల జిల్లా అధికారులతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బస్సు ప్రమాద ఘటనలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆరుగురు మృతిచెందారని, పదిమంది గాయాలతో బయటపడ్డారన్నారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నామన్నారు. మృతి చెందిన తెలంగాణ రాష్ట్రానికిచెందిన వారికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.5లక్షలు, గాయపడ్డ వారికి రూ.2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారన్నారు.ఈ ప్రమాదం బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో జరిగిందని,భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మహబూబ్నగర్ జిల్లాలోనూ 2013లో పాలెం వద్ద జరిగిన ఘటనలో 48 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలు సుశిక్షకులైన డ్రైవర్లను నియమించుకునేలా, రవాణా శాఖ నియమ, నిబంధనలను కచ్చితంగా పాటించేలా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. మంత్రితోపాటు తెలంగాణ జెన్కో సిఎండి హరీష్, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ మొగిలయ్య. ఆర్డీవో అలివేలు, ఉండవెల్లి ఎమ్మార్వో ప్రభాకర్, తదితరులున్నారు

## బస్సు ప్రమాద ఘటన బాధాకరం

**- ఎంపీ డీకే అరుణ దిగ్భ్రాంతి**



ఎంపీ డీకే అరుణ

**మహబూబ్‌నగర్, అక్టోబరు24,ప్రభాతవార్త :** కర్నూల్ బస్సు ప్రమాద ఘటనపై మహబూబ్‌నగర్ ఎంపీ అరుణమ్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

### చిన్నారులకు

## ఎమ్మెల్యే యెన్నం పరామర్శ

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు24,ప్రభాతార్త:** మహబూబ్ నగర్ గ్రామీణ మండలం రేగడిగడ్డ తాండాకు చెందిన వసంత్ కుమార్ (6), రుషిక (7),మానస (8), మనోజ్ (6) లు ఈ రోజు ఉదయం టపాసులు కాల్చే సమయంలో అవి పేలి తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక నాయకుల ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సాయంత్రం ఆసుపత్రికి వెళ్లి , ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించారు. అనంతరం చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలి అని ఆయన తల్లితండ్రులకు – మిగతా3లో..

# జిల్లాకు 45 ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్‌లు

- ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి
- ధాన్యం కొనుగోలుపై శిక్షణా కార్యక్రమం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్‌బ్యూరో, అక్టోబరు 24 ప్రభాత వార్త:** జిల్లాకు 45ఆటోమేటిక్ ప్యాడిక్లీనర్‌లు వారంలో రానున్నాయని,వానాకాలం సీజన్ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలుపై వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు, ఐకెపి, ఏపిఎంలు, సిసిలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల మానిటరింగ్ అధికారులు,కార్యదర్శులు,పాయింట్ ఇంచార్జిలువ్యవసాయశాఖ ఏడిలు,ఏఈఓలు, ఏఓలు, రైస్ మిల్లర్‌లకు శిక్షణాకార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్న దృష్ట్యా కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు కొనుగోలు ప్రక్రియలో చేపట్టవలసిన జాగ్రత్తలు,సూచనలు ఆయా శాఖల అధికారులు తెలిపిన విధంగా తప్పనిసరి పాటించాలని కలెక్టర్ సూచించారు. రైతులు ఆరబోసి తాలు, లేకుండా నిర్ణీత తేమ శాతం ఉన్న ధాన్యం తీసుకువచ్చేలా నాణ్యతా ప్రమాణాల గురించి వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన రైతుకు కొనుగోలు పత్రం జారీ చేయాలని, కొనుగోలు పత్రం తీసుకున్న రైతులు ఎట్టి పరిస్థితుల్లో మిల్లర్ వద్ద కు వెళ్లవద్దని తెలిపారు. కొనుగోలు పత్రంలో సూచించిన విధంగా మాత్రమే ధాన్యం ఆలస్యం చేయకుండా మిల్లర్‌లు దిగుమతి చేసుకోవాలని అన్నారు. వాతావరణ పరిస్థితులపై రైతులకు వ్యవసాయ అధికారులు తెలియచేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంకు తీసుకు వచ్చిన వెంటనే ఓపిఎంఎస్ లో రైతు వివరాలు అప్ లోడ్ చేయాలని అన్నారు. హార్వెస్టర్ యజమానులతో సమావేశం జరిపి వారికి ఆర్‌పిఎం 18 నుండి 19 వరకు ఉండేలా, ఇతర సూచనలు తెలుపాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి అవకతవకలు పాల్పడిన, నిరక్ష్యం వహించిన చర్యలు తీసు కుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డిఆర్‌డిఓ నర్సింహులు, జిల్లా సహకార అధికారి శంకరాచారి, పౌర సరఫరాల సంస్థ డి. ఎం.రవి నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంక టేష్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వేణుగోపాల్, జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి, సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఓపెన్ హౌస్

**- మహబూబ్‌నగర్ ఎస్పీ జానకీ**



**మహబూబ్‌నగర్, అక్టోబర్ 24,ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం పరేడ్ గ్రౌండ్‌లో రేపు ఉదయం 10 గంటలకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహణమహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డీ. జానకి ఆధ్వర్యంలో నేటి ఉదయం 10 గంటలకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం పరేడ్ గ్రౌండ్‌లో 'ఓపెన్ హౌస్" కార్యక్రమం నిర్వహించ నున్నట్లు ఎస్పీ జానకీ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ శాఖ పనితీరు, వివిధ డ్యూటీల విధానం, ఆధునిక పోలీసింగ్ విధానాలు, అలాగే సైబర్ క్రైమ్‌పై ప్రజల్లో చైతన్యం కల్పించే అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లా పరిధిలోని పాఠశాల, కళాశాల విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలు పాల్గొని పోలీస్ శాఖ కార్యకలాపాలపై అవగాహన పొందాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలతో పోలీస్ మధ్య పరస్పర అవగాహన, విశ్వాసం పెంపు లక్ష్యంగా చర్యలు చేపట్టబడుతున్నాయని ఎస్పీ తెలిపారు.

# భగీరథుడే నాకు ఆదర్శం : ఎమ్మెల్యే మేఘారెడ్డి

- పెద్దమందడిలో భగీరథుడి విగ్రహం
- ఆవిష్కరించిన వనపర్తి ఎమ్మెల్యే



భగీరథుడి విగ్రహం ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి, అక్టోబరు 24 ప్రభాతవార్త:** పట్టుదలలో భగీరథుడే ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయంగా ఉండాలని, నేను ఎల్లవేళలా భగీరథ మహర్షినే ఆదర్శంగా తీసుకుంటానని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దమందడి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన భగీరథుడి విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సగరుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుబడి ఉందన్నారు.దేశంలో ఎక్కడా లేనివిధంగా బీసీ రిజర్వేషన్ తెలంగాణలో అమలుపరిచి దేశానికే రోల్డ్ మాడల్ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నిలిచారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పెద్దమందడి మండల కేంద్రంలో 20 లక్షల రూపాయలతో సగరుల సామూహిక భవనాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సగర సంగం రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే ప్రత్యేక కృషితో ఏళ్ల నాటికల సాకారం...

ఎన్నో ఏళ్ల నాటి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయ సొంత భవన నిర్మాణం కల నేడు సహకారం అందిందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. ఎంతో ఘనచరిత్ర గల కాంగ్రెస్ పార్టీకి ఇప్పటివరకు జిల్లా కార్యాలయం లేకపోవడంతో తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన వెంటనే పార్టీ జిల్లా కార్యాలయం నిర్మాణం కోసం స్థల పరిశీలన చేసి సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి, సంబంధిత శాఖ మంత్రివర్యులు దృష్టికి తీసుకెళ్ళనని ఆయన తెలిపారు. తన అభ్యర్థనకు స్పందిస్తూ వనపర్తి పట్టణ శివారు రాజపేటలోని 73/2 సర్వే నెంబర్‌లోని 1 ఎకరం భూమిని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయ నిర్మాణానికి కేటాయిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. త్వరలోనే 73/2 సర్వే నెంబర్లో గల స్థలంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయానికి సంబంధించిన పనులు ప్రారంభమవుతాయని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి సంబంధించిన సహకరించిన జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా. మల్లు రవికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

### గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

వనపర్తి మినీ ట్యాంక్ బండ్ నల్లచెరువు కట్టపై గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే మత్స్యకారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వనపర్తి నియోజకవర్గం పరిధిలోని మత్స్యకారుల అభివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో వనపర్తి పట్టణ మత్స్య సహకార సంఘ సభ్యులు, మత్స్యకారులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఒక్క ఇల్లు ఇచ్చిన పాపాన పోలేదు

**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**

**దేవరకద్ర, అక్టోబరు 24 ప్రభాతవార్త:** గత ప్రభుత్వం కౌకుంట్ల మండలంలో ఒక్క ఇల్లు ఇచ్చిన పాపానపోలేదు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు ఇస్తున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి గుర్తు చేశారు. శుక్రవారం దమగ్నాపూర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో కౌకుంట్ల మండలం ముచ్చింతల గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే మా ఎజెండా అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడికి సొంతింటి కలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌకుంట్ల ఎంపీడీవో శివ ప్రసాద్, కురుమూర్తి చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




ముచ్చింతల లబ్ధిదారులకు ఇంద్రమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే

## అండర్ 17 కబడ్డీ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ఎంపిక

**ఉప్పునుంతల, అక్టోబరు 24 ప్రభాతవార్త :** 69 వ అండర్ 17 కబడ్డీ నాగర్ కర్నూల్ జిల్లా అంబటి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన టోర్నమెంట్ కం సెలక్షన్ విభాగంలో మండలంలోని వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటలోని మద్దూరులో జరిగే టోర్నమెంట్‌కు ఉప్పునుంతల మండలం వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు వెల్టూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ఆపాఠశాల హెచ్ఎం ఆంజనేయులు విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఉమ్మడి జిల్లాస్థాయిలో జరిగే టోర్నమెంట్‌కు తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు వారిని ప్రత్యేకంగా అభినందించారు.



వెల్టూరు హైస్కూల్ హెచ్ఎం చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్న క్రీడాకారులు

## రైతు సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యం

**దేవరకద్ర, అక్టోబరు 24 ప్రభాతవార్త :** రైతు సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతిని లక్ష్యంగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పని చేస్తున్నారని బస్వాయిపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం దేవరకద్ర మండలం బస్వాయిపల్లి గ్రామంలో ఓవర్ లోడ్ కారణంగా మోటర్లు పనిచేయడం లేదని బస్వాయిపల్లి గోవర్ధన్, విక్రమ్ కుమార్, శివకుమార్, ఫక్రుద్దీన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే వెంటనే స్పందించి రెండు 25 కేవి మంజూరు చేశారు. ఈ సంవత్సర కాలంలోనే బస్వాయిపల్లి గ్రామానికి రెండు 100 కేవి,పది 25 కేవి ట్రాన్స్ఫార్మర్స్‌లు మంజూరు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్స్ మంజూరు చేసినందుకు బస్వాయి పల్లి గ్రామం తరపున గ్రామ రైతులు, శివకుమార్, విక్రమ్, గోవర్ధన్,ఫక్రుద్దీన్‌లు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం బస్వాయిపల్లి కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రైతు కుటుంబంలో జన్మించిన ఎమ్మెల్యే జిఎంఆర్ రైతుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. దేవరకద్ర అభివృద్ధి కోసం, నిరంతరం కృషి చేస్తూ, దేవరకద్ర మున్సిపాలిటీకి రూ.19 కోట్ల 8 లక్షలు మంజూరు చేసిన ఘనత దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బస్వాయిపల్లి గ్రామ రైతులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

## అంతర్గత రోడ్ల అభివృద్ధికి కృషి

**ఎమ్మెల్యే డా. కూచుకుల్ల రాజేష్ రెడ్డి**

**తెలకపల్లి, అక్టోబరు 24 ప్రభాతవార్త:** గ్రామాలలో అంతర్గత రోడ్ల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి మంజూరైన 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం బడుగు, బలహీన వర్గాల పేద ప్రజల అభివృద్ధికి కృషి చేయుచున్నదని ప్రభుత్వం అందిస్తున్న సహాయ, సంక్షేమ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ బండపర్వతాలు,సింగిల్‌విండో వైస్‌చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య,మాజీ సర్పంచ్ సూర్య బాలగౌడ్, పార్టీ నాయకులు కొమ్ము పర్వతాలు, వెంకటయ్య గౌడ్, గుగ్గిళ్ళ ప్రకాష్, వారణాసి శ్రీనివాసులు, శారద, ఫరీద్, కొమ్ము శేఖర్, తిరుపతయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇండ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

## డిగ్రీ కళాశాల గెస్ట్ ఫ్యాకల్టీ నూతన కమిటీ ఎన్నిక

**గద్వాలటౌన్ అక్టోబర్ 24, ప్రభాతవార్త:** మహా రాణి ఆది లక్ష్మీ ్మ దేవమ్మ గద్వాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డి. రా ములు ఉపాధ్యక్షులుగా రఫీక్ కోశాధి కారిగా నాగరాజు జనరల్ సెక్రటరీగా రమేశ్ జాయింట్ సెక్రటరీగా రమాదేవి కమిటీ మెంబర్‌గా లలితను అతిథి అధ్యాపకులందరూ కలిసి ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు డి.రాములు మాట్లాడుతూ అనేక సంవ త్సరాలుగా అతిధి అధ్యాపకులుగా పనిచేస్తు వెట్టిచాకిరి చేస్తూ జీవనం గడుపుతూ శ్రమదోపిడీకి గురిఅవుతున్నారని అలాగే జీతాలు ప్రతి నెల రావడం లేదని 12నెలల జీతం అందలేదని ఉద్యోగ భద్రత లేదని వీటి అన్ని విషయా లపై నూతన కమిటీ సభ్యులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అతిథి అధ్యాపక బృందం నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు.



నూతనంగా ఎన్నికైన డిగ్రీ కళాశాల నూతన ఫ్యాకల్టీ కమిటీ

## బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం

**పంచాయతీ కార్యదర్శి అమరేందర్**

**తెలకపల్లి, అక్టోబరు 24 ప్రభాతవార్త:** మండల పరిధిలోని గోలగూడం గ్రామంలో శుక్రవారం కోనేరు స్వచ్ఛంద సంస్థ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పంచాయితీ కార్యదర్శి అమరేందర్ అన్నారు. 18 సంవత్సరాలలోపు బాలికలకు, 21 సంవత్సరాలలోపు బాలురకు, వివాహాలు చేయడం చట్టరీత్య నేరం. అందుకు రెండు సంవత్సరాలు జైలు శిక్ష లక్ష రూపాయల జరిమానా విధించడం జరుగుతుంది. బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతాయి. ప్రతి ఒక్కరు కూడా వివాహాలు జరగకుండా వాటిని నివారించేందుకు కృషి చేయాలని సూచించారు. బాల్య వివాహాలు దగ్గరగా ఉన్న కుటుంబాలకు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి అమరేందర్, అంగన్‌వాడి టీచర్ విద్యావతము, కోనేరు ఎన్జీవో, ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాస్ యాదవ్, కమ్యూనిటీ మొబిలైజర్ కల్పన, రాములు, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిలింగ్ ఇస్తున్న అధికారులు

# గోరక్షక్‌పై దాడి చేసిన గుండాలను వెంటనే శిక్షించాలి

**జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమం**

**బిజెపి జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ**

**వనపర్తి, అక్టోబరు 24, ప్రభాతవార్త:** గోరక్షక్ ప్రశాంత్ సింగ్ పై ఆవుల అక్రమ రవాణా మాఫియా హత్యాయత్నానికి నిరసనగా బిజెపి జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ, ధర్నా, కలెక్టరేట్ సిబ్బందికి మెమోరాండం ఇచ్చారు. కార్యక్రమంలో హిందూ వాహిని విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ దుర్గా వాహిని సంస్థల నాయకులు పాల్గొనడం జరిగింది. జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ నుండి శంకర్ గంజ్ వివేకానంద చౌరస్తా బస్ డిపో రోడ్ రాజీవ్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి రాజీవ్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీ ణించాయని నిత్యం వందలాది ఆవులను కంటెయినర్‌లలో తెచ్చి గోవధ చేస్తున్న మజ్లీస్ పార్టీ ఎమ్మెల్సీ డ్రైవర్ ఇబ్రహీం ఖురేషి కంటైనర్లను అనేకమార్లు ప్రశాంత్ సింగ్ పోలీసులకు పట్టించడంతో కోట్లలో నష్టం జరగడంతో నిందితులు ప్రశాంత్ సింగ్‌ను తుపాకితో కాల్చి నేరుగా చంపే ప్రయత్నం చేశారని బుల్లెట్ గాయాలతో చావు బతుకులో కొట్టుమిట్టాడుతున్నాడని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎంఐఎంతో రహస్య ఒప్పందం ప్రకారం ఆ వర్గ ఓట్ల కొరకై డిజిపి చే గోరక్షక్ డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని చెప్పించి హిందువుల మనోభావాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం దెబ్బతీస్తుందని హిందూ సమాజం చేతిలో కాంగ్రెస్ కు తగిన గుణపాఠం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, సబిరెడ్డి వెంకటరెడ్డి, మున్నూరు రవీందర్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్.లోకనాథ్ రెడ్డి ,జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు శ్రీనివాస్ గౌడ్, కల్పనా, హిందు వాహిని అభిలాష్, అరుణ్ గౌడ్, విశ్వహిందూ పరిషత్ హర్షవర్ధన్, బజరంగ్ దళ్ సాయి ముదిరాజ్, సీనియర్ నాయకులు ఏ.రామన్ గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి కదిరే మధు, ఆర్.వెంకటేశ్వర్ రెడ్డి, ఏ.సీతారాములు, ఏ. సుమిత్రమ్మ, పి. విష్ణువర్ధన్ రెడ్డి, దాసరాజు, ప్రవీణ్ జిల్లా ఉపాధ్యక్షులు బాశెట్టి శ్రీను, రాఘవేందర్ గౌడ్, జిల్లా కార్యదర్శులు కాటమోని కృష్ణ గౌడ్, కందూరు రామ్ రెడ్డి, సరోజ, పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు అశ్విని, రాధా, ఎస్సీ మోర్చా అధ్యక్షులు గంధం ప్రవీణ్, కిసాన్ మోర్చా అధ్యక్షులు అరవింద్ రెడ్డి, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సూగూరు లక్ష్మి ్మ, మండలాల అధ్యక్షులు సంద వెంకటేష్, ముప్పూరి చెన్నయ్య, క్రాంతి నాయుడు, విష్ణువర్ధన్, తిరుపతిరెడ్డి, సూగూరు రాములు, ప్రధాన కార్యదర్శులు నవీన్ చారి, నల్లవోతుల అరవింద్, సంద రమేష్, రామకృష్ణ, బక్క శీను, వాకిటి సుదర్శన్, వెంకటేష్ నాయక్, రాయన్న సాగర్, చాణక్య, కూన శ్రీకాంత్, కడమంచి శివ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ సిబ్బంది ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు



రాజీవ్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బిజెపి నాయకులు

## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26వేలు చెల్లించాలి

**ఆత్మకూర్ అక్టోబర్ 24, ప్రభాతవార్త :** తెలంగాణ వ్యాపితంగా పనిచేస్తునటువంటి మున్సిపల్ కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలుగా చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల కార్మిక సంఘం టి యు సి ఐ.. రాష్ట్ర అధ్యక్షులు కే సూర్యం డిమాండ్ చేశారు. శుక్రవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ము న్సిపల్ కార్యాలయం ముందు టియుసిఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన కే సూర్య మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన దేశవ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాలలో ఉద్యోగుల నియామకం కొనసాగిందని ప్రస్తుతం దేశవ్యాప్తంగా జనాభా పెరిగిన నేపథ్యంలో జనాభా ప్రాతిపదికన మున్సిపల్ కార్యాలయాలకు అదనపు సిబ్బంది నియమించుకునేందుకు ప్రభుత్వం తక్షణమే ఆదేశాలు జారీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రాంతంలో మున్సిపల్ కార్మికులను మూడు విభాగ విభజించి వేతనాలు చెల్లిస్తున్నారని అలాకాకుండా అన్ని రకాల కార్మికులను ఒకే గ్రూప్లో ప్రవేశపెట్టి కనీస వేతనం 26,000 చెల్లించాలని లేనిపక్షంలో కార్మికుల జీవితాలతో అటు ప్రభుత్వ అధికారులు ఇటు కార్మిక శాఖ అధికారులు చెలగాటమాడుతున్నవారుగా పరిగణించాల్సి ఉంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలకు అనుగుణంగా మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాల్సిన అవసరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఆయన అన్నారు. అంతకుముందుగా తెలంగాణ ప్రదేశీల కార్మిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వరకు కార్మికుల పెద్ద ఎత్తున చేరుకుని ధర్నా నిర్వహించారు. అనంతరం ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ శశిధర్ కు సమస్యలతో కూడిన ఎంత పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పియుసిఐ నాయకులు హనుమంతు, ప్రసాద్, ఆంజనేయులు తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నుండి ప్రతిపాదనలు ఆహ్వానం

**గద్వాల టౌన్ అక్టోబర్ 24, ప్రభాత వార్త:** తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ వారి ఆదేశాల మేరకు ట్రైనింగ్ ఎంప్లాయిమెంట్ అండ్ ప్లేస్మెంట్ ప్రోగ్రాం పథకంలో భాగంగా రాష్ట్రంలోని నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ప్రభుత్వ అనుబంధిత మరియు ప్రసిద్ధ శిక్షణ సంస్థల నుండి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అల్పసంఖ్యాక సంక్షేమ అధికారి సుశిత ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన సంస్థలు అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా ఉపాధి అవకాశాలు కూడా కల్పించాలని తెలిపారు. శిక్షణ సంస్థలు తమ ప్రతిపాదనలను క్రింది పత్రాలతో జిల్లా సంబంధిత కార్యాలయానికి సమర్పించాలని తెలిపారు. సంస్థ యొక్క రిజిస్ట్రేషన్/ ఇన్ కార్పొరేషన్ సర్టిఫికెట్ వివరాలు చిరునామా మరియు సంప్రదింపు నెంబరు, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అనుబంధ సర్టిఫికెట్‌గత మూడు సంవత్సరాల ఆదాయపు పన్ను రిటర్న్ లు మరియు ఆడిట్ నివేదికలు, గత మూడు సంవత్సరాలలో అందించిన నైపుణ్య శిక్షణ ప్రదర్శన, కోర్సు పూర్తి చేసిన సర్టిఫికెట్లు/ సంబంధిత ప్రభుత్వ సంస్థల ద్వారా జారీ చేయబడిన వర్క్ ఆర్డర్లు, తృతీయ పక్షా అంచనా నివేదిక సంస్థ అందించిన శిక్షణ నాణ్యతపై దృవీకరణ, సంస్థ అందించిన శిక్షణల విజయ గాథలు, ఫోటోలు గత సంవత్సరంలో ఉపాధి కల్పించిన రికార్డులు లేదా బ్యాంక్ స్టేట్మెంట్లు జిల్లాలో ఉన్న శిక్షణ కేంద్రాల వివరాలు మరియు అక్కడ పని చేస్తున్న సిబ్బంది వారి యొక్క అర్హతల జాబితా మరియు అన్ని పత్రాలతో నవంబర్ 06వ తేదీ లోపు జిల్లా అల్పసంఖ్యాక సంక్షేమ అధికారి కార్యాలయం నందు సమర్పించవలసిందిగా కోరారు. ఇతర వివరములకు ఫోన్ నెంబర్ 7013032567 ను సంప్రదించాలని కోరారు.

## సోను సింగ్ పై హత్యాయత్నం చేసిన దుండగులను శిక్షించాలి

**గద్వాల టౌన్ అక్టోబర్ 24, ప్రభాతవార్త:** గో రక్షకుడు సోను సింగ్ పై హత్యాయత్నం చేసిన బహుదూర్ పుర దుండగులను కఠినంగా శిక్షించాలని, సోను సింగ్‌కు ప్రభుత్వం వైద్య సదుపాయాలు కల్పించి ఆదుకోవాలని విశ్వహిందూ పరిషత్,భజరంగ్ దల్ జోగులాంబ గద్వాల జిల్లాసభ్యులు కలెక్టర్,ఎస్పీలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవులను రక్షించడం వంటి ధర్మ కార్యక్రమం చేస్తున్నటువంటి ప్రశాంత్ కుమార్ అలియాస్ సోనూ సింగ్‌ను బహదూర్ పురాకి చెందినటువంటి దుండగులు పథకం ప్రకారం తుపాకీ తో కాల్చి హత్యా ప్రయత్నానికి ఒడిగట్టడం అమానుషం అన్నారు. హత్యాయత్నం కు పాల్పడిన దుండగులను వెంటనే అరెస్టు చేసి నిందితులను చట్టప్రకారం కఠినంగా శిక్షించి న్యాయం చేయాల్సిందిగా విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ డిమాండ్ చేశారు. గాయపడిన గోరక్షకుడు సోనూ సింగ్ కు ప్రభుత్వమే తగిన వైద్య సదుపాయాలు కల్పించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిందిగా వారు కోరారు. ఇలాంటి సంఘటనలు మున్ముందు జరగకుండా గోరక్షకులకు ప్రభుత్వం,పోలీసులు తగిన రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో భజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ తిరుపతి మనికృష్ణ, వి.హెచ్.పి. జిల్లా సహకార్యదర్శి మనోజ్ రెడ్డి,జిల్లా సహ సంయోజక్ మల్లికార్జున్,భజరంగ్ భాస్కర్,బోరవెల్లి రాకేశ్ యోగా శ్రీకాంత్,దేవదాస్,గోసాయి వేణు,రాజా రెడ్డి, ప్రవీణ్,తిరుమలేష్, మధు,రాకేష్,రమేష్,రంజిత్,వీరేశ్,పాలిమేర వీరన్న తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ నర్సింగరావు కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## కేజీబీవీ విద్యార్థిని సంధ్యకు అభినందనలు తెలిపిన కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 24 ప్రభాతవార్త:** విద్యార్థులు విద్యను అభ్యసించడంతోపాటు క్రీడలలోను రాణించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాగంకర్నూలు జిల్లా పెంట్లవెల్లి కేజీబీవీ విద్యార్థిని సంధ్యను శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బాలికను అభినందించి శాలువాతో సత్కరించారు. హైదరాబాద్‌లో ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నీ అండర్-19 విభాగంలో సంధ్య అద్భుత ప్రదర్శన కనబర్చడంతో విద్యార్థిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థిని తీర్చిదిద్దిన పిఈటీ రాజేశ్వరిని కలెక్టర్ ప్రశంసించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా మానసికంగా, శారీరకంగా దృడంగా ఉంటారని సూచించారు. క్రీడాపోటీలలో గెలుపు ఓటములు సహజమని ఓటమి చెందిన విద్యార్థులు మరోసారి ప్రయత్నం చేసి విజయం సాధించేందుకు పట్టుదలతో ప్రయత్నించాలన్నారు. విద్యార్థులు వివిధ రకాల క్రీడల్లో పాల్గొనేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్, కేజీబీవీ ల పర్యవేక్షణ అధికారిని శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని సంధ్యను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్

## సింగారం గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు

**నారాయణపేట టౌన్, అక్టోబరు 24 ప్రభాతవార్త :** జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ కె.లక్ష్మీపతి గౌడ్ అధ్యక్షతాన నారాయణపేట మండలం సింగారం గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ కె.లక్ష్మీపతి గౌడ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం మన పౌరులకు న్యాయ సేవాధికారి సంస్థ ద్వారా రెండు ఉచిత న్యాయ సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఉచితంగా న్యాయవాదిని నియమించుకునే ఏర్పాటు ఉందని తెలియజేశారు. మరియు ఎటువంటి క్రిమినల్ కేసైనా ఎటువంటి ఫీజు చెల్లించకుండా ఉచితంగా న్యాయవాదిని నియమించుకుని అట్టి కేసును వాదించుకునే అవకాశం ప్రస్తుతం మనకు అందుబాటులో ఉందని తెలియజేశారు. దానితోపాటు 15100 ఈ నంబరు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ యొక్క టోల్ ఫ్రీ నెంబర్ దీనికి ఎప్పుడైనా ఫోన్ చేసి ఉచితంగా న్యాయ సహాయము గాని న్యాయ సలహాలు గానీ పొందవచ్చని, వికలాంగులకు ఉపాధి అవకాశాలకు కావలసిన సమాచారం కోసం కూడా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. ఇదే సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.సురేష్ మాట్లాడుతూ గిరిజన చట్టాలపై ప్రజలకు ఉన్న ప్రాథమిక హక్కులు ప్రాథమిక విధులు వాటి యొక్క ఆచరణ విధానాల గురించి తెలియజేసి వాటిని ఏరకంగా మనము వాడుకోవచ్చని విషయాల గురించి తెలియజేశారు. ప్రతి ఒక్కరూ తాము కొనే ప్రతి ఒక్క వస్తువుకు రసీదు తీసుకోవాలని ఒకవేళ తీసుకున్న వస్తువు సరిగ్గా పని చేయకపోతే వినియోగదారుల సంఘంలో కేసు వేసి నష్టపరిహారం పొందవచ్చని తెలియజేశారు. అదేవిధంగా బాల్యవివాహాలు చేయటం వల్ల వచ్చే ఇబ్బందులు, చట్ట ప్రకారం చర్యల గురించి తెలియజేశారు. బాల కార్మికుల చట్టం గురించి, వృద్ధుల సంరక్షణ చట్టం గురించి పోక్సో యాక్ట్ గురించి వివరంగా ఏఏఓ వివరించడం జరిగింది. కార్యక్రమంలో ఎంఏఓ, ఏఏఓ పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ కె.లక్ష్మీపతి గౌడ్

## వెల్టూర్ స్టేజ్ వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు



వెల్టూరు స్టేజ్ వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన గ్రామస్తులు

**ఉప్పునుంతల, అక్టోబరు 24 ప్రభాతవార్త :** శ్రీశైలంహైదరాబాద్ ప్రధాన రహదారిలోని వెల్టూరు స్టేజి వద్ద భూములు కబ్జాకు గురి అవుతున్నాయని, సర్వే నెంబర్లు గల భూమిని కొనుగోలు చేయడం, అమ్మడం చేయద్దని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అనుమతులు లేకుండా అక్రమాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు శుక్రవారం సంత భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

## గ్రామాలలో ప్రారంభమైన ఈ కేవైసీ

**ఉప్పునుంతల, అక్టోబరు 24 ప్రభాతవార్త :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబు కార్డు కలిగిన ప్రతి ఒక్కరిని ఈ కేవైసీ చేయించాలని డిఆర్‌డిఓ అధికారులు ఆదేశించడంతో శుక్రవారం మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లు జాబు కార్డు కలిగిన వారి వద్దకు వెళ్లి ఈ కేవైసీ చేయడం ప్రారంభించారు. గురువారం మండల కేంద్రమైన ఉప్పునుంతల లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపట్ల మండల స్థాయిలో ప్రజా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు డిఆర్‌డిఓ రాజేశ్వరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు అందించారు. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరిని ఈ కేవైసీ చేయించాలని, గ్రామ పంచాయతీలలో ఫిర్యాదు రికార్డులను అందుబాటులో ఉంచాలని ఆదేశించడంతో శుక్రవారం మండలంలో ఎంపీడీఓ మోహన్ లాల్, ఈజీఎస్ ఏపిఓ పర్వతాలు ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాలలో జాబ్ కార్డు కలిగిన వారి వద్దకు వెళ్లి ఈ కేవైసీ చేశారు.

## ఐజెయు నేషనల్ కౌన్సిల్ మెంబర్ కొంతం ప్రశాంత్‌కు ఘన సన్మానం



కొంతం ప్రశాంత్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**పెబ్బేరు, అక్టోబరు 24 ప్రభాతవార్త :** పెబ్బేర్ మండల తోగుటవీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన జర్నలిస్ట్ యూనియన్ ఐజేయు నేషనల్ కౌన్సిల్ మెంబర్ కొంతం ప్రశాంత్‌ను శాలువా పూలమాలతో ఘనసత్కారం చేశారు. ప్రశాంత్ మాట్లాడుతూ తొగుట వీర క్షత్రియులు అన్ని రంగాలలో ఎదగాలని అలాగే రాజకీయంగా, విద్యాపరంగా, అన్ని స్థాయిలలో ఎదగాలని తోగుటవీర క్షత్రియ సంఘానికి గుర్తింపు వచ్చేలా అందరూ కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తొగుట వీర క్షత్రియ సేవా సంఘం సభ్యులు పురు రమణ, పెనుగొండ శ్రీనివాసులు, పురు శ్రీనివాసులు, సితార వెంకటేశ్వర్లు, బాలరాజు, పవన్, రంగం నరసింహ, రాజు, పెద్ది రమేష్, వెంకటేశ్వర్లు, విజయ్ బాబు, టియుడబ్ల్యూజే జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ బలపల రమేష్, పూజారి గోపి తదితరులు పాల్గొని ఘనంగా సత్కరించడం జరిగింది.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం

**కల్వకుర్తి, అక్టోబర్ 24 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం ఎలికట్ట గ్రామానికి చెందిన మహేశ్వరికి పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారమివ్వడంతో అంబులెన్స్ గ్రామానికి చేరుకొని మహేశ్వరిని కల్వకుర్తి ప్రభుత్వా ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో కుర్మిద్ద శివారులోకి రాగానే మహేశ్వరికి పురిటినొప్పులు రావడంతో అంబులెన్స్ సిబ్బంది, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ వరప్రసాద్, పైలట్ అశోక్‌లు అంబులెన్స్‌లో డెలివరీ చేశారు. మహేశ్వరికి 4వ సంతానం పాప జన్మించిందని, తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని సిబ్బంది తెలిపారు. మెరుగైన వైద్య సేవలకు కల్వకుర్తి ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలించినట్లు తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

**తెలకపల్లి, అక్టోబరు 24 ప్రభాతవార్త:** మండల పరిధిలోని గడ్డంపల్లి గ్రామానికి చెందిన కాకునూరి శ్రీనివాసులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుల్ల రాజేష్ రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 1 లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పరంగా బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, గౌరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ బాల గౌడ్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

## మెరుగైన వైద్యం కోసం ఎల్‌ఓసి అందజేసిన ఎమ్మెల్యే

**పెబ్బేర్, అక్టోబరు 24 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం తోమలపల్లి సీనియర్ కార్యకర్త ఉమేష్ గౌడ్ కూతురు కుమారుడు పుట్టు బీర, పుట్టు చీర కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూతురు కొడుకును ఆశీర్వదించడం జరిగింది. అలాగే సుగురు గ్రామానికి చెందిన వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ నరసింహాయాదవ్ కుమార్తె ఎంగేజ్మెంట్ కార్యక్రమంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. పెబ్బేరు మండల రామాపురం గ్రామ నివాసి అయిన పుట్ట రవి నిమ్స్ హాస్పిటల్ ఖర్చు నిమిత్తం కాలుకు ఆపరేషన్‌కై ఎల్‌ఓసిని ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలం మార్కెట్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, యాపర్ల రామ్‌రెడ్డి, లక్ష్మణ్, రామన్ గౌడ్, మధుసూదన్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## డయాగ్నోస్టిక్ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**నారాయణపేట టౌన్, అక్టోబరు 24 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని సివిల్ లైన్ మార్గంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గందె అనసూయ చంద్రకాంత్ కుమారుడు గందె సుమిత్ నూతనంగా ఏర్పాటు చేసిన అపోలో డయాగ్నోస్టిక్ కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణిక రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అపోలో డయాగ్నోస్టిక్స్ కేంద్రం నిర్వాహకులు ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేను డయాగ్నోస్టిక్ కేంద్ర నిర్వాహకులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

## మరో బీసీ ఉద్యమానికి సమాయత్తం

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగెం సూర్యారావు**

**మహబూబ్‌నగర్, అక్టోబర్24, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ తరహాలో మరో బీసీ ఉద్యమానికి స్వీకారం చుట్టేందుకు బీసీలందరూ సమాయత్తం కావాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇన్చార్జ్ సంగెం సూర్యారావు పిలుపునిచ్చారు. శుక్రవారం మహబూబ్‌నగర్ రోడ్లు,భవనాల శాఖ అతిథి గృహం దగ్గర విలేకరులతో సంగెం సూర్యారావు మాట్లాడుతూ గతవారం జరిగిన బంద్ లో అన్ని పార్టీలు పాల్గొని మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తు చేస్తూ అందరూ పార్టీల కతీతంగా అందరూ బీసీ ఉద్యమంలో పాల్గొని 42శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు విద్య ,ఉద్యోగాల్లో అవకాశాలు వచ్చేవరకు పోరాటాలు చేయాలని కోరారు.అన్ని రాజకీయ పార్టీలలో ఉన్న బీసీ లందరూ తమ పదవులకు రాజీనామాలు చేసి ముందుకు వచ్చినపుడే బీసీలు చేస్తున్న 42 శాతం రిజర్వేషన్ల సాధించుకునేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు.కార్యక్రమంలో తెలంగాణరాజ్యాధికార పార్టీ నాయకులు విజయ్ కుమార్, రవిముదిరాజ్, శేఖర్ పాల్గొన్నారు.

## బాల్యవివాహాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి

**ఊట్కూర్, అక్టోబరు 24 ప్రభాతవార్త :** జనవరి 26 నాటికి నారాయణపేట జిల్లాను సంపూర్ణ బాల్యవివాహాల రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్ శైలజ పిలుపునిచ్చారు. ఊట్కూర్ మండల పరిధిలోని పెద్ద జట్రం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట బాల్యవివాహాల నివారణ, బాల కార్మిక వ్యతిరేక మరియు అనాథపిల్లల సంరక్షణపై అవగాహనకార్యక్రమం నిర్వహించారు.గ్రామస్తులకు బాల్య వివాహాల దుష్పరిణామాలు, బాల కార్మికత్వం వల్ల కలిగే నష్టాలు, పిల్లల విద్య ప్రాముఖ్యతపై వివరించారు. ఈ కార్యక్రమంలో గౌరీశంకర్, తిమ్మప్ప, సోమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అబుబాకర్‌కు బోరబండ డివిజన్ ప్రచార బాధ్యతలు

**భూత్పూర్, అక్టోబర్ 24,ప్రభాతవార్త :** త్వరలో జరిగే జూబ్లీ ఉప ఎన్నికల ప్రచారం కోసం కాంగ్రెస్ తరఫున బోరబండ డివిజన్ ఇంచార్జ్ బాధ్యతలు కాంగ్రెస్ సేవాదల్ రాష్ట్ర కార్యదర్శి భూత్పూర్‌కు చెందిన అబుబాకర్ సిద్దిఖీకి అప్పగిస్తూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సేవాదల్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ శుక్రవారం ఉత్తర్వు జారీ చేశారు.అబుబాకర్ సిద్దిఖీ జూబ్లీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ బోరబండ డివిజన్ ప్రచార బాధ్యతలు నిర్వర్తిస్తారు.

## అంతర్యుద్ధం


(మొదటి పేజీ తరువాయి)

తీవ్రంగా చర్చనీయాంశం అయింది.రెండు రోజుల క్రితంటిపిసిసి కోఆర్డినేటర్ దారా భాస్కర్ మాట్లాడుతూ దుష్యంత్‌రెడ్డి తననుమానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, తనతో ఎవరు మాట్లాడి నాకూడావారిని ఇబ్బందిపెట్టేప్రయత్నం చేస్తున్నాడనిబహిరంగంగానే ప్రకటించిన సంగతి తెలిసిందే.

**వివాదాలకు కేరాఫ్..:** మొదటినుంచి జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి ఘాటైన , వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. సొంత కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పై కూడా అవ కాశం ఉన్నప్పుడల్లా తనదైన శైలిలో మాట్లాడుతూ పార్టీ అధిష్టానాన్ని సీఎం రేవంత్ రెడ్డిని ఇరుకున పెట్టే ప్రయత్నాలు చేస్తూ వచ్చారు.తిరుగుబాటు జెండా ఎగరవేసిన 10మంది ఎమ్మెల్యే లతోపాటు అనిరుధ్‌రెడ్డి కూడా ఉన్నాడని ప్రచారం జరగడంతో తాను ఎక్కడా కూడా పార్టీ గీత దాటలేదని మీడియాకు చెప్పే ప్రయత్నం చేశారు.రెండు వారాల కింద అరబిందో ఫార్మ కంపెనీని తగలబెడతానంటూ, తెలంగాణలో ఆంధ్రా కాంట్రాక్టర్లు, చంద్రబాబు కోవర్టులు ఉన్నారంటూ, హైడ్రా కూల్చివేతలపై, ఇటీవల జరిగిన డిసిసి అధ్యక్ష ఎన్నికకు సంబంధించి నిర్వహించిన అభిప్రాయ సేకరణ సమావేశంలోనూ నడుతూ మంత్రుల ఇలాకాకే నిధులు అత్యధికంగా వెళ్తున్నాయని, కొడంగల్ నియోజకవర్గంలో 5000 కోట్లతో అభివృద్ధి పనులుజరుగుతున్నాయని, మరో రెండు సార్లు తనను గెలిపిస్తేతాను కూడా సీఎం అభ్యర్థిని అవుతాను అంటూ చెప్పుకొచ్చారు. ఇలా నిత్యం ఏదోఒక ఆసక్తికర, వివాదస్పద వ్యాఖ్యలు చేస్తూ మీడియాలో చర్చకు దారితీస్తున్నారు. ఇలా రోజుకో చోట సొంత పార్టీ నేతలే ఎమ్మెల్యే సోదరుడిపై తిరుగుబాటు చేయడంతో ఎమ్మెల్యేకు తలనొప్పిగా మారిందని నాయకులు చర్చించుకుంటున్నారు.

### దుష్యంత్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ లేఖ

**- విడుదల చేసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తెర కృష్ణయ్య యాదవ్**




డీసీసీ మాజీ ఉపాధ్యక్షులు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి సోదరులు జనంపల్లి దుష్యంత్ రెడ్డిని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాజాపూర్ మండల అధ్యక్షుడు కత్తెర కృష్ణయ్యయాదవ్ సస్పెండ్ చేస్తున్న ట్టు సోషల్ మీడియాలో ఓ లేఖ విడుదల చేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సోదరులు దుష్యంత్‌రెడ్డిని సస్పెండ్ చేయడం జడ్చర్ల నియోజకవర్గంలో చర్చనీ యాంశం అయింది. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సోదరుడు దుష్యంత్ రెడ్డిని పార్టీ నుంచి ఐదేళ్ల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు రాజాపూర్ మండల అధ్యక్షుడు కత్తెర కృష్ణయ్య యాదవ్ జారీ చేసిన ఉత్తర్వులు సామాజిక మాధ్యమాల్లో హల్చల్ చేశాయి. గతంలో భూ వ్యవహారాలకు సంబంధించి దుష్యంత్‌రెడ్డి కృష్ణయ్యయాదవ్ మధ్య కొన్ని నెలలుగాఆరంభమైన కుమ్ములాటలు..ఇటీవల బహిర్గతం అయ్యాయి. ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకోవడంతో అధికార పార్టీ నాయకుల్లో ఉన్న విభేదాలు పతాక స్థాయికి చేరుకున్నాయి. ఇటీవల దుష్యంత్ రెడ్డి ఓ యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూలో కత్తెర కృష్ణయ్యయాదవ్ పై తీవ్ర విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో కృష్ణయ్య యాదవ్ మండల పార్టీ అధ్యక్షుడి హోదాలో జిల్లా కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు దుష్యంత్ రెడ్డిని పార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని, అందుకే అతడిని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నానంటూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కత్తెర కృష్ణయ్య యాదవ్ తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా కమిటీ సభ్యులకు కూడా సమాచారం అందజేసినట్లు కత్తెర కృష్ణయ్య యాదవ్ పేర్కొన్నారు.

## చిన్నారులకు ఎమ్మెల్యే యెన్నం పరామర్శ

(మొదటి పేజీ తరువాయి)

అందుబాటులో మనకు మంచి వైద్యం అందించే వైద్యులు ఉన్నారని ఎలాంటి భయం వద్దని , ఎప్పటికప్పుడు వైద్యుల పర్యవేక్షణలో పిల్లలకు మంచి వైద్యం అందుతుందని ఆయన తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగ అజ్మీర, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేంధర్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు శ్రీనివాస్ యాదవ్, రమేష్ నాయక్, లక్ష్మణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# గన్స్ ఉపయోగించిన వారిపై చర్యలేవి

**- ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి**



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 24, ప్రభాతవార్త:** డెక్కన్ సిమెంట్ డబ్బుల వసూల వ్యవహారంలో గన్స్ ఉపయోగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాజీ బిసి కమిషన్ మెంబెర్ కిషోర్ గౌడ్, నగేష్ ముదిరాజ్ బీఆర్ఎస్ పార్టీ తరపున జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెక్కన్ సిమెంట్ డబ్బుల వసూల వ్యవహారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాన అనుచరుడు రోహిన్ రెడ్డి, కొండా సురేఖ ఓఎస్డి సుమంత్‌ల మధ్య చెలరేగిన డెక్కన్ సెమెంట్ వారి నుండి డబ్బులు వసూళ్ళ పంపిణి విషయంలో గన్స్ ఉపయోగించారనే వివాద అంశంపై బీఆర్ఎస్ పార్టీ తరఫున గన్సు ఉపయోగించిన రోహిన్ రెడ్డి , కొండా సురేఖ ఓఎస్డి సుమంతులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,బిసి కమిషన్ మెంబర్ కిషోర్ గౌడ్,నాగేష్ ముదిరాజ్.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు అనంతరం వారు మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో అన్ని రంగాలు కలకలలాడాయని,కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని రంగాలను అస్తవ్యస్తం చేసి గన్స్‌తో బెదిరింపులు చేస్తూవసూలకు పాల్పడుతు పారిశ్రామికవేత్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని రాష్ట్రాన్ని మరో బీహార్‌లా తయారు చేసేపనిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిమాగ్నమైఉన్నటున్నారని ఆరోపించారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్టానికి, హైదరాబాద్ నగరానికి కేసీఆర్ కేటీఆర్ గారు అనేక రకాల పరిశ్రమలు తెచ్చి అభివృద్ధి చేస్తే.ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కొత్త పరిశ్రమలు తేపోగా ఉన్న పరిశ్రమల యాజమాన్యాల వద్ద కాంగ్రెస్ నాయకులు అక్రమ వసూళ్లకు పాల్పడుతు న్నారని ఈ విషయాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని రానున్న రోజుల్లో కాంగ్రెస్కు బుద్ధి చెప్పే రోజులు రానున్నాయని అన్నారు.

## వైభవంగా పోచమ్మ తల్లి, బొడ్రాయి ప్రతిష్టాపన



బొడ్రాయి ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర, అక్టోబరు 24 ప్రభాతవార్త:** బొడ్రాయి పోచమ్మ తల్లి గ్రామదేవతల ప్రతిష్టాపన కన్నుల పండువగా నిర్వహించారు. దేవరకద్ర మండలం హజిలాపూర్ గ్రామంలో శుక్రవారం బొడ్రాయి ప్రతిష్టాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి గ్రామ దేవతలను, అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో బొడ్రాయి, పోచమ్మ తల్లి గ్రామ దేవతల మహోత్సవానికి బంధుమిత్రులు, మహిళలు, అధిక సంఖ్యలో తరలి రావడంతో హజిలాపూర్ గ్రామం భక్తులతో కళకళలాడాయి. ఈ సందర్భంగా పురోహితులు వేదమంత్రోచరణాలతో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి స్వాగతం పలికి, సన్మానం చేశారు. తదనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి, శివకుమార్, విక్రమ్, హజిలాపూర్ గ్రామ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## హమాలీ దారుణ హత్య



హత్యకు గురైన హమాలీ మైబు



హత్యకు గురైన మైబు (ఫైల్)

**దేవరకద్ర, అక్టోబరు 24 ప్రభాతవార్త:** దేవరకద్ర మండల పరిధిలో గురువారం రాత్రి దారుణహత్య జరిగింది. దేవరకద్ర మండలం అడవి అజిలాపూర్ గ్రామానికి చెందిన దానం మైబు (40) అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ శివారులో కాపు కాసి దారుణంగా నరికి హత్య చేశారు. మైబు వృత్తిరీత్యా దేవరకద్ర మార్కెట్ యార్డులో హమాలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే గురువారం రాత్రి మైబు తన పని ముగించుకొని 9:30 గంటల సమయంలో తన గ్రామానికి తన మోటార్ సైకిల్ పై వస్తుండగా ఈ ఘటన జరిగిందని స్థానికులు పోలీసులు తెలిపారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవరకద్ర ఎస్ఐ నాగన్న తెలిపారు. దానం మైబు హత్య వివాహేతర సంబంధమే కారణమా లేదా ఇంకా ఏమన్నా కారణాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని దేవరకద్ర ఎస్సై నాగన్న తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నట్లు చెప్పారు. అందరితో కలిసి మెలిసి ఉండే వ్యక్తి దారుణ హత్యకు గురి కావడంతో అడవి హాజిలాపూర్ లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## కూలీ పనులకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం

**నవాబుపేట, అక్టోబరు 24 ప్రభాతవార్త :** మండల పరిధిలోని లోకిరేవు గ్రామానికి చెందిన తెలుగు సీనయ్య (44) గల వ్యక్తి రోజు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. రోజువారి లాగానే 20వ తేదీన సోమవారం కూలీపనికి వెళ్ళొస్తానని చెప్పి ఇంటి నుండి బయలుదేరిన సీనయ్య రాత్రి వేళకు కూడా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన భార్య జయమ్మ అతని కుమారుడు చెన్నయ్య అతని ఫోన్ కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ వస్తుండటంతో, ఆందోళన చెందిన భార్య కుమారుడు చెన్నయ్య చుట్టుపక్కల బంధువులకు తెలిసిన వారిని సంప్రదించి వెతికిన ఎక్కడ కూడా ఆచూకీ లభించకపోవడంతో నవాబుపేట పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఇందిరాపార్క్ ధర్నాలో భూత్పూర్ బీసీ నాయకులు

**భూత్పూర్, అక్టోబర్ 24,ప్రభాతవార్త :** బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద బీసీలు చేపట్టిన ధర్నాలో భూత్పూర్ మండలానికి చెందిన బీసీ సంఘాల సభ్యులు,నాయకులు పాల్గొని తమకు 42శాతం రిజర్వేషన్ ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.భూత్పూర్ మండలం మద్దిగట్లలో బీసీ నేతలు ప్రత్యేక సమావేశం నిర్వహించి కరపత్రాలు,వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ధర్నాలో ఎంపీటీసీ తమన్నగౌడ్,రాజమల్లయ్య,మెరుగు చెన్నయ్య, కంబు రాములు,బేటా మల్లయ్య, రాములు మహారాజ్, రవికుమార్, పిట్టల శేఖర్,సాకలి మాసయ్య,సూరయ్య,వెంకటేష్ ముదిరాజ్, అంజనేయులు, ధను,భాస్కర్,వినోద్, పాల మూరు శివయ్య, శివకుమార్ పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన ఈ కేవైసీ పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

లబ్దిదారులతో సమావేశాలు ఏర్పాటు చేయించి గ్రౌండ్ చేసుకునే విధంగా ప్రోత్సహించాలని కలెక్టర్ ఎంపీడీవోలను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రారంభం చేసుకోకపోవడానికి గల కారణాలను తెలుసుకొని ఏమైనా సమస్యలు ఉంటేవాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. ఆర్థిక సమస్యలు వల్ల ఇళ్ల నిర్మాణం ప్రారంభించని వారు ఎవరైనా ఉంటే గుర్తించిస్వయం సహాయక బృందాల ద్వారా రుణాలు ఇప్పించే సౌకర్యం కూడా ఏర్పాటు చేయా లని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైనగ్రామపంచాయతీ,అంగన్‌వాడి భవనాలను నిర్మాణం చేపట్టేందుకు వేగంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్అధికారులను ఆదేశించారు.సమావేశంలో డిఆర్డిఎ పిడి ఉమాదేవి, గృహనిర్మాణ శాఖ డిఈవిఠోబా, పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ మల్లయ్య,జిల్లా పంచాయతీ అధికారి రఘునాథ్, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలను నెరవేరుస్తున్నామని, ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ లక్ష్మీ నారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరసింహా రావు, హౌసింగ్ డిఇ పప్పులత,ఎంపీడీవో కార్యాలయం సూపర్డెంట్ హరిచంద్రరెడ్డి, పంచాయతీ సెక్రెటరీ హైమావతి, మాజీ ఎంపీటీసీ సునీత, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆశన్న,పార్టీ నాయకులు పులిందర్‌రెడ్డి, మల్లేపల్లి రాజేందర్ రెడ్డి, కోస్గి మొగులయ్య, శ్రీనివాస్,తిరుపతి రెడ్డి, వెంకటేష్, హనుమంతు,నర్సింలు,పాలమూరు ఆంజనేయులు, కృష్ణయ్య, కొండయ్య, మాజీ ఎంపిటిసిలు, సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోడల్ సోలార్ విలేజ్‌గా మరికల్ ఎంపిక

(మొదటి పేజీ తరువాయి)

విలేజ్‌గా ఎంపికైనట్లు కలెక్టర్ తెలిపారు. మరికల్ గ్రామం, మండలాన్ని అధికారులు తనిఖీ చేయాలని ఆమె ఆదేశించారు. అలాగే మోడల్ సోలార్ విలేజ్ మార్గదర్శకాల ప్రకారం గ్రామాన్ని సౌరశక్తితో కూడిన గ్రామంగా మార్చేందుకు వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక తయారు చేయాలని సూచించారు. డిపిఆర్ ఆమోదం పొందిన ఒక సంవత్సరంలోపు ప్రాజెక్టులను పూర్తిగా అమలు చేసేలా జిల్లా స్థాయి కమిటీ పర్యవేక్షిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ప్రణీత్, ఎల్‌డీఎం విజయ్ కుమార్, రెడ్‌కో డీఎం మనోహర్ రెడ్డి, ట్రాన్స్‌కో డి.ఇ నరసింహరెడ్డి, డిపిఓ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో

**దామరగిద్ద, అక్టోబరు24 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను మండల అభివృద్ధి అధికారి సాయిలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి అనంతరం మధ్యాహ్నన భోజనం చేశారు. పంచాయతీ సెక్రెటరీ తిరుపతి రెడ్డి, జిహెచ్ఎం సురేష్, మధ్యాహ్నం భోజనం ఇంచార్జ్ శంభు లింగం, జూనియర్ అసిస్టెంట్ మౌలానా ఉన్నారు.



## శేష వాహనంపై ఊరేగిన దేవదేవుడు

**మహబూబ్‌నగర్ (చిన్న చింతకుంట), అక్టోబరు 24 ప్రభాతవార్త :** శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత సమేతుడైన దేవదేవుడు శేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామి వారి ప్రధానాలయంలో వేద పండితులు స్వామివారి ఉత్సవ విగ్రహాలను వివిధ పూలతో అలంకరించిన పల్లకిలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారి పల్లకినిఅల్లిపూర్ దాసులు ఒంటిమిట్ట వరకు తీసుకొచ్చారు.మాడవీధులు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల గోవింద నామస్మరణతో కాంచన గుహ పులకరించింది. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## కనులపండువగా విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

*పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దంపతులు*



**మహబూబ్‌నగర్, అక్టోబరు24,ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ పురపాలిక పరిధిలోని ఏనుగొండ సమీపంలో శ్రీశ్రీశ్రీ కంఠ మహేశ్వర స్వామిసురమాంబ విగ్రహ స్థిర ప్రతిష్ట, ఎల్లమ్మ, మైసమ్మల గౌడ కుల దేవతల విగ్రహ ప్రతిష్టలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ దంపతులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వారికీ స్వాగతం పలికారు.అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం లో గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న,మున్సిపల్ మాజీ చైర్మన్‌నర్సింహులు, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకురుమూర్తి ఆలయంలో ఈ-హుండీ ఏర్పాటు



స్వామివారి ప్రధానాలయంలో ఈ హుండీని ఏర్పాటు చేసిన దృశ్యం

**మహబూబ్‌నగర్ (చిన్న చింతకుంట), అక్టోబరు 24 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామ సమీపంలో గల దేవరగట్టులోని కాంచన గుహలో వెలసిన శ్రీకురుమూర్తి స్వామి దేవాలయంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ హుండీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆన్లైన్‌లో నగదు బదిలీ జరుగుతున్న తరుణంలో వినూత్నంగా దేవస్థానంలో ఈ హుండీ ఏర్పాటు చేశారు. భక్తులకు కూడా ఈ హుండీ ద్వారా స్వామివారికి మొక్కల రూపేనా నగదును వేయవచ్చని ఆలయ ఈవో మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు.ఈ హుండీలను స్వామివారి ప్రధానాలయంలో, కొండ దిగువన దేవస్థాన ఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఎస్బిఐ అధికారులు స్వామివారిని దర్శించుకున్నారు.

## పోలీస్ అమరవీరుల జీవితాలు చిరస్మరణీయం

**◆ మక్తల్ సిఐ రామ్ లాల్**

**మక్తల్ టౌన్,అక్టోబరు24 ప్రభాతవార్త:** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మక్తల్ సిఐ రామ్‌లాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామ్‌లాల్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, యువతలో పెరుగుతున్న డ్రగ్స్ వ్యసనాన్ని అరికట్టే దిశగా అవగాహన అవసరమని చెప్పారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని సూచించారు.డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్రవిద్యార్థులు మాదకద్రవ్యాల నుండి ఎలా దూరంగా ఉండవచ్చు అని అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలలో అత్యుత్తమ విజేతలను స్టేట్ కాంపిటీషన్‌కు పంపించడం జరుగుతుందని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**నారాయణ పేట, అక్టోబరు 24 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్, కళాశాలలో డ్రగ్స్‌పై అవగాహన వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని యువతలో పెరుగుతున్న డ్రగ్స్ వ్యసనాన్ని అరికట్టడానికి విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు అత్యంత అవసరమని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని సూచించారు. అంశం డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు మాదకద్రవ్యాల నుండి ఎలా దూరంగా ఉండవచ్చు అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ విద్యార్థులకు అన్యాయం చేయొద్దు

**- ఎస్ఎఫ్ఐ పాలమూరు యూనివర్సిటీ నాయకుల డిమాండ్**

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 24,ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీ గత సంవత్సరం మాదిరిగానే ఈ విద్యా సంవత్సరం ఎస్సీ విద్యార్థుల అడ్మిషన్స్ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ పాలమూరు యూనివర్సిటీ ఆధ్వర్యంలో రిజిస్ట్రర్ రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు బత్తిని రాము, రాజేష్ యాదవులు మాట్లాడుతూ సిపి గెట్ ద్వారా పీజీలో అడ్మిషన్ పొందిన ఎస్సీ విద్యార్థులకు గత సంవత్సరంలో మెస్ డిపాజిట్ అమ్మాయిలకు 8100,అబ్బాయిలకు 10100 ఉంది ఈ విద్యా సంవత్సరం రూ.8000 వేలకు పెంచడం సరైనది కాదని, అదేవిధంగా ట్యూషన్ ఫీజు కూడా ఇప్పుడే చెల్లించాలన్నడంతో పేదలు విద్యకు దూరమవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షురాలు విద్యుల్లత,భాను ప్రకాష్, సుధాకర్, ఎన్ ఎస్ యూఐ పి యు అధ్యక్షుడు వంశీ, నాయకులు శివ భద్రు,సాయి ,అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి దశల వారీగా ప్రభుత్వం నుండి నిధులు విడుదల**

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్**



ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, అక్టోబరు 24 ప్రభాతవార్త:** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లకు మంజూరి పత్రాలు అందుకుని ఇంకా ప్రారంభించని వారు త్వరగా ప్రారంభించి, నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ వనపర్తి మండల పరిధిలోని చందాపూర్, చిట్యాల గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లకు మంజూరి పత్రాలు అందుకుని ఇంకా ప్రారంభించని వారు త్వరగా ప్రారంభించి, నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి దశల వారీగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. గ్రౌండింగ్ ప్రారంభించిన ఇళ్లు బెస్‌మెట్ లెవల్‌కు చేరితే మొదటి విడత చెల్లింపులు జరుగుతుందని అన్నారు. ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతోందని, పనులను నాణ్యవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు పర్యవేక్షణను క్రమం తప్పకుండా కొనసాగించాలని కలెక్టర్ అన్నారు. పెండింగ్ లేకుండా లబ్ధిదారులకు నగదు పడే విధంగా చూసుకోవాలని, పెండింగ్ సమస్యలు ఏమైనా ఉంటే నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే లబ్ధిదారులకు ఇసుకకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. గణితంపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. చందాపూర్ గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థుల గణితం మార్కుల నివేదికతో పాటు ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ గురించి ఆరా తీశారు. గణితంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, గృహ నిర్మాణ శాఖ డిఈ విఠోబా, తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఎంపీడీవో, ఇతర అధికారులు చేయాలని తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## కలెక్టర్‌కు భారతీయ కిసాన్ సంఘ్ నాయకుల వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, అక్టోబరు 24 ప్రభాతవార్త :** రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎం కిసాన్, ఈజీస్, పనులు పట్టణంలోని పళ్ళబురుజు రైతులకు పొందలేక పోతున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే ప్రతి పథకాన్ని రైతులకు అవగాహన కల్పిస్తూ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం భారతీయ కిసాన్ సంఘ్ నాయకుల ఆధ్వర్యంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ పత్తి పంట అమ్మలన్న వ్యవసాయ కార్యాలయం నందు స్లాట్ బుక్ చేసుకున్న 20 మంది రైతులకు నిరాశ ఎదురవడం జరుగుతుందన్నారు. స్థానిక మండల అగ్రికల్చర్ అధికారి మరియు జిల్లా వ్యవసాయ అధికారి గత నాలుగు సంవత్సరాలుగా నుండి భారతీయ కిసాన్ సాంగ్ ప్రతి సంవత్సరం వ్యవసాయ శాఖకున్న రెవెన్యూ శాఖ గాని జిల్లా కలెక్టర్ గాని ఫిర్యాదు చేస్తూనే ఉన్నామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో రాష్ట్ర జాయింట్ కార్యదర్శి వెంకోబా, జిల్లా ఉపాధ్యక్షులు శామమూలాబాలప్ప, జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి, జిల్లా సహకార దర్శి ప్రభు మిస్కిన్,జిల్లా ఉపాధ్యక్షులు శరణమయ్యస్వామి, జిల్లా సహకార్యదర్శి మల్లికార్జున్, ఓబులాపురం మైపాల్ రెడ్డి, పటేల్ రంగారెడ్డి, నగర అధ్యక్షులు ఆకుల వెంకటప్ప, ఉపాధ్యక్షులు తగు విశ్వనాథ్‌రెడ్డి, గోడుగు లక్ష్మీనారాయణ,పట్టణ కార్యదర్శి ఆంజనేయులు యాదవ్, సింగారం నరసింహులు,తింగనోల బుగ్గప్ప, సంధ్రుక లక్ష్మణ్, బాపనపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**మద్దూరు, అక్టోబరు 24 ప్రభాతవార్త :** మద్దూరు పట్టణ కేంద్రంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టిజిస్ డబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాలలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం వ్యాస రచన పోటీలు మద్దూరు ఎస్సై విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్ కుమార్ మాట్లాడుతూ, పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, యువతలో పెరుగుతున్న డ్రగ్స్ వ్యసనాన్ని అరికట్టే దిశగా అవగాహన అవసరమని చెప్పారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని సూచించారు. అంశము: డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు మాదకద్రవ్యాల నుండి ఎలా దూరంగా ఉండవచ్చు అని అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో అత్యుత్తమ విజేతలను స్టేట్ కాంపిటీషన్ కు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్చాలి



**బిజినేపల్లి, అక్టోబరు 24 ప్రభాతవార్త:** విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో 42 బీసీ రిజర్వేషన్లు తక్షణమే కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్చాలని, రాష్ట్ర ప్రభుత్వం దీనికై కేంద్రంపై బలమైన ఒత్తిడి తీసుకురావాలని మండల బిసి సంఘం నాయకులు అన్నారు. 42 బీసీ రిజర్వేషన్ల సాధన సమితి ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ లో చేపట్టిన మహాధర్నాకు శుక్రవారం బీసీ సంఘం నాయకులు తరలి వెళ్లారు. మండల కేంద్రంలోని పూలే అంబేద్కర్ విగ్రహాలకు నివాళి అర్పించిన అనంతరం మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన బీసీ కులాలకు స్థానిక సంస్థల్లో ఉప వర్గీకరణ చేసి రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వలన బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది కావున వాటిని రద్దు చేయాలి లేదా బిసి, ఎస్సీ, ఎస్టీల లోని నిరుపేద వర్గాలకు ఇందులో అవకాశం కల్పించాలన్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ,మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు సంబంధించిన బడ్జెట్లు తక్షణం విడుదల చేయాలి అని సబ్ ప్లాన్ అమలు చేయాలన్నారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీని వెంటనే ప్రారంభించాలని, ప్రవేశ పరీక్షలకు సంబంధించి జీవో 29ను రద్దు చేసి, పాత జీవో 55ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. బీసీలకు ఎస్సీ ఎస్టీల వలె రక్షణ చట్టాలు కల్పించాలని, జనాభా నిష్పత్తి ప్రకారం బీసీలకు 56 రిజర్వేషన్లు అమలు చేయాలి. మేమెంతో మాకు అంత వాట అమలుపరచాలన్నారు. రాజ్యాంగ సవరణ చేసి న్యాయ స్థానాలు సృష్టించిన 50 సీలింగ్ ఎత్తి వేయాలని, ఉద్యోగాల ప్రమోషన్లలో బీసీ లకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. హై కోర్ట్, సుప్రీం కోర్టుల న్యాయ మూర్తులు నియామకాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ లకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. నామినేటెడ్, కార్పొరేషన్ పదవులలో సామాజిక న్యాయం పాటించి బీసీ, ఎస్సీ, ఎస్టీ లకు జనాభా దామాషా ప్రకారం నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్ స్వామి, సత్యశీల సాగర్, రాజేందర్ గౌడ్, అనిల్ గౌడ్, శివయ్య, శ్రీనివాస్, భూపతి, రామన్ గౌడ్, భగవంతు, సిద్దుల శివ, నరేందర్ గౌడ్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్

**దామరగిద్ద, అక్టోబరు 24 ప్రభాతవార్త:** దామరగిద్ద తహసిల్దార్ తిరుపతయ్య మధ్యాహ్న భోజనం తనిఖీలో భాగంగా మొగల్మడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం ప్రతిరోజూ ఇదే విధంగా చేయాలని, బియ్యంలో పురుగులు ఉంటే అలాంటి బియ్యాన్ని వాడరాదు. వాటిని గోదాముకు పంపించి, మంచి బియ్యాన్ని తెప్పించుకోవాలని చెప్పారు. స్టోర్ రూమ్, కిచెన్ షెడ్, మధ్యాహ్న భోజనం, స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. తదుపరి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జీ హెచ్‌ఎం నవ్యశ్రీ, మధ్యాహ్న భోజన ఇంచార్జీ ఉపాధ్యాయులు శశిధర్, బనాధయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

**నవాబుపేట, అక్టోబరు 24 ప్రభాతవార్త :** మండల అధికారులతో పాటు ప్రత్యేక అధికారి సునీత విద్యార్థుల పట్లవారి చదువు మరియు వారికి ఉండాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. మండల పరిధిలోని ఎనమనగండ్ల బాలుర మరియు బాలికల హాస్టళ్లను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి సునీత, మండల అధికారులు ఎంపీడీవో జయరాం నాయక్ హాస్టల్లను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న పౌష్టికాహారా నియమావళిని క్రమంగా పాటిస్తున్నారా అని కావలసిన వసతులు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంస్వయంగా ఉండి మధ్యాహ్న భోజనం స్వయంగా విద్యార్థులతో కలిసి పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు ఏమైనా సందేహాలు సమస్యలు ఉంటే కంప్లైంట్ బాక్స్ లో విద్యార్థులు రాసి ఏర్పాటు చేసిన బాక్సులో వేయాలని ఫలితంగా అధికారులకు సమస్యలు పరిశీలించడంలో కంప్లైంట్ బాక్సు దోహదపడుతుందని బాక్స్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధికారులతో పాటు హాస్టల్ వార్డెన్లు తదితరులు విద్యార్థులు ఉన్నారు.

## కాపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన



కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**దామరగిద్ద, అక్టోబరు 24 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలంలో వివిధ గ్రామాలలో వ్యవసాయ శాఖ, పంచాయతీ రాజ్, రెవెన్యూ సిబ్బంది కలిసి మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులకు కపాస్ కిసాన్ యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు కపాస్ కిసాన్ యాప్ డౌన్లోడ్ చేసుకుని, స్లాట్ బుకింగ్, మద్దతు ధరలో పంటలను మధ్యవర్తుల లేకుండా సులభంగా విక్రయించడం వంటి ముఖ్య సూచనలను తెలిపారు. స్లాట్ బుకింగ్ ద్వారా రైతులు తమ పత్తి అమ్ముకునే తేదీ, మిల్లును ముందస్తుగా నిర్ధారించుకుని, వ్యవధి అనుసారంగా గిన్నింగ్ మిల్లుదగ్గర రద్ధి తగ్గించి సమయం వృధా కాకుండా ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోలు జరుగుతుంది అని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో మణిచందర్, వ్యవసాయ విస్తరణ అధికారులు, గోపాల్, అజయ్, పంచాయతీ సెక్రెటరీలు, జీపీఓలు పాల్గొన్నారు.

# గోరక్షకులపై దాడులకు పాల్పడితే సహించేది లేదు

■ గో సంరక్షకుల కోసం ప్రత్యేక చట్టం తేవాలి ■ విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్



నిరసన చేస్తున్న బిజెపి నాయకులు

**నారాయణపేట టౌన్, అక్టోబరు24 ప్రభాతవార్త:** గోసంరక్షకులపై దాడులకు పాల్పడితే సహించేది లేదని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కన్నశివకుమార్ హెచ్చరించారు. మేడ్చల్ జిల్లా పోచారంకు చెందిన గోరక్ష క్ ప్రశాంత్ సింగ్ పై అలియాస్ సోనూ సింగ్ పై కొంతమంది పశువుల వ్యాపారులు ఉద్దేశపూర్వకంగా చంపేందుకు కుట్రలో భాగంగా యానంపేట సమీపంలోని ఓ నిర్మానుష్య వెంచర్‌లోకి తీసుకువెళ్లి ప్రశాంత్ సింగ్ పై దుండగులు కాల్పులు జరపడాన్ని నారాయణపేట విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్, గోరక్ష ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. గో సంరక్షకుని పై తుపాకీతో కాల్పులు జరిపిన వ్యక్తికి మొదట తుపాకీ ఎక్కడి నుంచి వచ్చింది అనే దానిపై దర్యాప్తు చేయాలన్నారు. హిందూ మనోభావాలు దెబ్బతీసేలా ఎవరు కుట్రలు చేసిన సహించబోమని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా కొనసాగుతున్న గోవదశాలలను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు.ఇలాంటి ఘటనలు పునరావృత్తమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక పోస్టులను ఏర్పాటు చేసి అక్రమ గో రవాణాను అడ్డుకోవాలన్నారు.నిందితులపై కఠిన చర్యలు తీసుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మురళి భట్టడ్ , కడుదాస్‌ప్రవీణ్,వడ్లశ్రావణ్, అనంత్‌రెడ్డి, ఎలక్ట్రిసిషియన్ సందీప్, ఉమా, వరలక్ష్మీ , భీమేష్, వెంకోబా , రవి, వెంకటప్ప, వెంకటేష్, చరణ్, సురేష్, అనిల్, ఎం.ఆకాష్, సాగర్,శివ, మూర్తి, విజయ్, కిషోర్,అవుటి భరత్,శీను, అరవింద్, చక్రి పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి





మున్సిపల్ కమిషనర్ శ్రీరాములుకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, అక్టోబరు 24 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (రిజిస్టర్ నం. బీ.96, అనుబంధం టియుసిఐ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీరాములుకు వినతి పత్రం అందజేశారు. టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఎస్.కిరణ్, తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కొలిమి రాములు సమస్యలను వివరిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ రంగంలో సుమారు 65 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు.వీరికి మూడు కేటగిరిల వారీగా వేతనాలు చెల్లిస్తున్నారు. కేటగిరి 1రూ.15,600/, కేటగిరి॥ రూ. 19,500/ ,కేటగిరి॥। రూ.22,750/ వేతనాలు ఇస్తున్నారు. కానీ నేటి నిత్యావసర సరుకుల ధరలు చూస్తే ప్రభుత్వం ఇచ్చే వేతనం సరిపోవడం లేదన్నారు. కుటుంబ భారాన్ని మోయడం కష్టతరం అవుతున్నదనీ,అనారోగ్యాలు సంభవించినప్పుడు విద్యార్థులకు ఫీజులు చెల్లించే సమయంలో అప్పులు చేసుకొని ఫీజులు కట్టాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. జీవితం అంతా అప్పుల భారంతో జీవిస్తూ,మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాల్సిన అవసరం ఉన్నదనిఅన్నారు.ఆంధ్ర రాష్ట్రంలో కేటగిరి। రూ.18,500/ నుండి రూ.24,500/ లు వరకు చెల్లిస్తున్నా, ఆ రకంగా తెలంగాణాలో కూడా వేతనాలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. మున్సిపల్ కార్మికులపై పనిభారం విపరీతంగా పెరిగిపోయిందనీ,2025జనాభా ప్రాతిపదికన సిబ్బందిని నియమించి కార్మికుల పని భారం తగ్గించాలనీ, నూతనంగా అప్గ్రేడ్ అయిన మున్సిపాలిటీలలో 5 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని,శానిటేషన్ వర్కర్స్‌సబ్బులు, నూనెలు, గౌజులు, ఆప్రాన్స్, షూస్లు సంవత్సరాలు గడిచినా ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (రిజిస్ట్రేషన్ నెంబర్96 అనుబంధం)నాయకులు జి కృష్ణయ్య, బాలకృష్ణ, జె.బాబు,రాయకోడ ఆంజనేయులు, రామలింగం, వెంకటేష్ , బేగరి నరసింహ, లింగన్న, కర్రెం నర్సప్ప, శివ, రాకేష్, ఎమ్మార్ అనిల్, బాలమ్మ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు ఇస్తున్న దృశ్యం

**నర్వ, అక్టోబరు 24 ప్రభాతవార్త:** పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి అని పశువైద్యాధికారి డా. శరత్ చంద్ర అన్నారు. శుక్రవారం నారాయణ పేట జిల్లా నర్వ మండలంలోని లక్కర్ దొడ్డి గ్రామంలో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణిని గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం సందర్భంగా మండలంలో 4 నెలల పైబడిన పశువులన్నీటికీ కూడా ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గాలికుంటు వ్యాధి వైరస్ వలన పశువులకు సోకుతుంది.ఈ వ్యాధి పశువులకు సోకడం వల్ల పశువులలో ఉత్పాదక శక్తి, పునరుత్పత్తి శక్తి సామర్థం తగ్గుతుందన్నారు. ఈ వ్యాధి సంభవిస్తే పాడి రైతులకు ఆర్థికంగా ఎక్కువ నష్టం సంభవిస్తుందని, అందువల్ల నాలుగు నెలల వయసు దాటిన దూడలకు,పశువులకు ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు కచ్చితంగ వేయించాలన్నారు. ఈ టీకా పశువులఆరోగ్యం మెరుగుపరుస్తుందని రైతులను సలహా ఇచ్చారు. ఆవులు, గేదెలు, ఎద్దులు వంటి పశువులు ఈ వ్యాధికి గురయ్యే అవకాశాలు ఉన్నందున రైతులు ముందస్తు చర్యగా పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ధన్వాడ పెద్ద చెరువులో చేప పిల్లల విడుదల



చేప పిల్లలు విడుదల చేస్తున్న దృశ్యం

**ధన్వాడ, అక్టోబరు24 ప్రభాతవార్త:** ధన్వాడ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కాంత్‌కుమార్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ధన్వాడ మండలం అధ్యక్షులు నిరటి నరసింహులు నాయుడు ముదిరాజ్ ఆధ్వర్యంలో రెండు లక్షల 18 వేల చేప పిల్లలను చిట్టెం మాధవరెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు, సదాశివరెడ్డి నారాయణపేట మార్కెట్ కమిటీ అధ్యక్షులు బ్రహ్మానందం ధన్వాడ మండల ప్రత్యేక అధికారి చేతుల మీదుగా చేప పిల్లలను చెరువులో వదలడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్. సింధుజ, తాసిల్దార్ ధన్వాడ వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీడీవో ధన్వాడ జట్రం లక్ష్మయ్య గౌడ్, నారాయణపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్,వర్ధన్ ఫీల్డ్ ఆఫీసర్, అనిల్‌కుమార్ ఫీల్డ్ ఆఫీసర్, గుండ్ల కుంట నర్సింలు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్య దర్శి ధన్వాడ, శ్రీనివాసరావు, సెక్రటరీ ధన్వాడ, సంద లక్ష్మయ్య, సంద బాల్ రాజు, గువ్వలపల్లి వెంకట రాములు, టప్ప భాస్కర్, నీరటి అశోక్ కుమార్ నీరటి బాబా, ఎద్దుల రాఘవేందర్, పటేల్ రాములు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి సోదరుడు

**మద్దూరు, అక్టోబరు24 ప్రభాతవార్త:** ఉమ్మడి మద్దూరు మండల పరిధిలోని శుక్రవారం వివిధ గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి, వెంకట్ రెడ్డి (కడ) శంకుస్థాపన చేశారు. మండల పరిధిలోని ఎక్కామెడ్ గ్రామంలో 50 లక్షలతో ఆంజనేయస్వామి ఆలయం నిర్మాణం, గోకుల్ నగర్ గ్రామంలో 50లక్షలతో వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణం, అలాగే 50 లక్షల రూపాయలతో నిర్మించిన బంజారా భవనం ప్రారంభోత్సవం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రఘుపతిరెడ్డి, మద్దూరు మండల పిఎసిఎస్ చైర్మన్‌నరసింహులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నిర్జింత తిరుపతి రెడ్డి, రమేష్ రెడ్డి, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన మండల వ్యవసాయ అధికారిగా ఏ. ప్రవీణ్ కుమార్

**మద్దూరు, అక్టోబరు 24 ప్రభాతవార్త:** మద్దూరు మండలం నూతన వ్యవసాయ అధికారిగా ఏ. ప్రవీణ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.అనంతరం వారు మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా నుండి ఇక్కడికి రావడం జరిగిందని, సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలోని మండలానికి విధి నిర్వహణ బాధ్యత నిర్వహించడానికి అవకాశం వచ్చినందుకు తనకు సంతోషంగా ఉందని సంతోషంను వ్యక్తపరుస్తూ, తను గ్రామ వ్యవసాయ అధికారి స్థాయి నుండి మండల వ్యవసాధికారిగా ప్రమోషన్‌తో ఇక్కడికి రావడం జరిగిందని తెలిపారు.మండల పరిధిలోని వ్యవసాయ ఉత్పత్తులు పెంచడంతో పాటు ఆధునిక విధానంగా వ్యవసాయం కొనసాగేలా ప్రయత్నం చేస్తానని అలాగే మండల పరిధిలో నకిలీ విత్తనాలు, నకిలీ వ్యవసాయ పిచికారి మందులు అమ్ముతున్నట్టు తెలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకొని షాప్ లైసెన్సును రద్దు చేయబడునని ఒక ప్రకటన తెలిపారు.

## మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

**నారాయణపేట టౌన్, అక్టోబరు24 ప్రభాతవార్త:** మన్యంకొండ నుండి నారాయణపేటకు వెళ్లే మార్గంలో మరికల్ వద్ద మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ లీకేజీ ఏర్పడినందున, దెబ్బతిన్న పైపును తీసివేసి కొత్త పైపు అమర్చాల్సిన అవసరం ఉంది. అందువల్ల నీటిసరఫరా తాత్కాలికంగా నిలిపివేయ బడుతుందని మిషన్‌భగీరథ గ్రీన్ డివిజన్ మహబూబ్నగర్ కార్య నిర్వాహక అభియంత డి.శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటన లో తెలిపారు.ఆయన మాట్లాడుతూ మరమ్మత్తు పనుల కారణంగా నీటి సరఫరా 24.10.2025 సాయంత్రం 8 గంటల నుండి 25.10.2025 సాయంత్రం 8 గంటల వరకు 24గంటల పాటు నీటిసరఫరా నిలిపి వేయబడుతుంద న్నారు. నిలిచే ప్రాంతాలు మన్యంకొండ నీటి శుద్ధి కేంద్రం నుండి నీరు అందే క్రింది ప్రాంతాలకు సరఫరా నిలిపివేయ బడుతుంది. అసెంబ్లీ నియోజకవర్గాలు దేవరకద్ర, నారాయణ పేట, మక్తల్ పూర్తిగా ప్రభావిత మండలాలు: దేవరకద్ర, నర్వ, మరికల్, ఊట్కూర్, నారాయణపేట, దామరగిద్దాక్షి కంగా ప్రభావిత మండలాలు: కౌకుంట్ల, చిన్నచింతకుంట, మక్తల్,ధన్వాడ మున్సిపాలిటీలు: మక్తల్,దేవరకద్ర, నారాయణపేటమొత్తంగా 245 గ్రామాలు,3 మున్సిపాలిటీలు ప్రభావిత పరిధిలోకి వస్తాయి ప్రజలందరూ సహకరించాలన్నారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి



**లింగాల, అక్టోబరు24 ప్రభాతవార్త:** పాఠశాలలోని విద్యార్థు లకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈఓ బషిర్ అహ్మద్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఆవుసలి కుంట, కొత్తకుంటపల్లి గ్రామాల పాఠశాలలను తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా పలు రకాల రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు కోరారు. మధ్యాహ్న భోజనం నాణ్యమైనదిగా వండాలని వంట ఏజెన్సీకి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు అందజేత

**నారాయణపేట టౌన్, అక్టోబరు 24 ప్రభాతవార్త :** జాతీయస్థాయి చాలెంజర్ కప్ మెరిసిన మాస్టర్ షాటోకాన్ కరాటే దూ ఇండియా విద్యార్థులను శుక్రవారం భీష్మ రాజ్ ఫౌండేషన్ కార్యాలయం, నారాయణపేటలో విజేతలకు భీష్మ రాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. కే. రాజ్ కుమార్ రెడ్డి బహుమతులు అందజేసి అభినందించారు. విజేతలుగానిలిచిన వారిలో స్రవంతి, బృంధా, మహేశ్వరి, అభిరామ్‌బంగారు పతకాలు గెలుచుకోగా, బవేష్ రజత పతకం, కార్తీక్ కాంస్య పతకంసాధించి తమ కోచ్‌లకు, తల్లిదండ్రులకు గర్వకారణమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, క్రీడలు పిల్లల వ్యక్తిత్వ వికాసానికి పునాది వేస్తాయి అన్నారు. ఇలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం ఫౌండేషన్ గర్వకారణం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల్‌రాజ్, అశోక్, మహేష్ వంటి సీనియర్ బ్లాక్ బెల్ట్ మాస్టర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే పర్యటన

**దామరగిద్ద, అక్టోబరు24 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల కేంద్రంలోని నేడు రైతు వేదికలో మండలానికి చెందిన కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం, పిఎసిఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి పాల్గొంటారు. అలాగే దామరగిద్ద మండలం వత్తుగుండ్ల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో కిచెన్ షెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. మండలానికి చెందిన లబ్ధిదారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అందరూ పాల్గొని పైనతెలిపిన కార్యక్రమాలనువిజయవంతం చేయాలని కె.బాల్‌రెడ్డి, దామరగిద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోరారు.

## గోరక్షకులపై దాడి దుర్మార్గం

### బిజెపి మండల అధ్యక్షుడు గువ్వని నవీన్

**లింగాల, అక్టోబరు24 ప్రభాతవార్త:** గోవుల అక్రమ రవాణా చేస్తున్న వారిని అడ్డుకుంటున్న గోరక్షకులపై దాడులకు పాల్పడడం దుర్మార్గమైన చర్య అని, దాడులకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని బిజెపి మండలధ్యక్షులు గువ్వని నవీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, పోలీసులపై రౌడీ షటర్ల దాడికి పాల్పడడంఇందుకు నిదర్శనమన్నారు.కాంగ్రెస్ పాలనలో ఎంఐఎం ఆగడాలు మీతిమిరిపోతున్నాయని, గోవులను అక్రమ రవాణా చేసి గోహత్యలు చేస్తున్నారని, హిందువులే లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గోరక్షకుడు ప్రశాంత్ సింగ్ సోనుపై కాల్పులకు పాల్పడిన వ్యక్తిని అతని అనుచరులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

**ఊట్కూర్, అక్టోబరు24 ప్రభాతవార్త:** నిన్న రాత్రి తెల్లవారుజామున ఊట్కూర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. పెద్దపొర్ల గ్రామానికి చెందిన కొత్తగుడిసే అరుణ్‌కుమార్ (21) అనే వ్యక్తి ట్రాక్టర్‌లో ఇసుకను నింపుకొని పెద్దపొర్ల గ్రామానికి తరలిస్తుండగా, ఉట్కూర్‌పోలీసులు నాగిరెడ్డిపల్లి శివారులో అడ్డుకున్నారు.ఇసుక తరలింపుకు సంబంధించి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేవని గుర్తించిన పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని ఊట్కూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉట్కూర్ పోలీస్‌స్టేషన్‌సబ్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ మండల పరిధిలో ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం” అని హెచ్చరికలు జారీ చేశారు.

## శక్తి పీఠంలో కార్తిక పురాణ ప్రవచనం

**నారాయణపేట, అక్టోబరు 24 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా కేంద్రంలోని శక్తి పీఠంలో 2వ రోజు కార్తిక మాసం ప్రత్యేకం కార్తిక పురాణ ప్రవచనం చేసిన ప్రముఖ కృష్ణ యజుర్వేద స్మార్త పండితులు బ్రహ్మశ్రీ ఉట్కూర్ విభావసు పురోహిత్ అగ్నిహోత్రి, కార్తిక పురాణ కార్యక్రమం ప్రతి రోజు రాత్రి 7:00 నుండి 7:30 కార్తిక పురాణం భగవన్నామ సంకీర్తన, మంగళహారతి తీర్థ ప్రసాద శక్తి పీఠంప్రాంగణంలోని స్వామి శాంతానంద సభామండపంలో ఉంటుంది. సమాప్తి భక్తులందరినీ శక్తి పీఠంలో కార్తిక మాసం సందర్భంగా ఈ నెల పొడవునా అఖండ దీపారాధన నిర్వహించబడుతుంది. భక్తులు దీపారాధనకు అవసరమైన ఆవు నెయ్యిని దానంగా సమర్పించవచ్చు అని తెలిపారు.

## విద్యుత్ శాఖకు రాష్ట్ర సమాచార కమిషన్ నోటీసులు జారీ

**నారాయణ పేట, అక్టోబరు24 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా విద్యుత్ శాఖ డిఈ నర్సింగరావు మక్తల్ ఊట్కూరు మండల విద్యుత్ శాఖ ఎఈలకి రాష్ట్ర సమాచార కమిషన్ నుండి నోటీసులు జారీ అయ్యాయి. సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం పరిరక్షణ ఐక్య వేదిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు కొనింటి నర్సిములు 2021,2022న ఊట్కూరు మండల ఎఈ విద్యుత్ శాఖకి దరఖాస్తు సమర్పించారు ఆదరఖాస్తులో 2018 సంవత్సరం నుండి ఇప్పటి వరకు ఊట్కూరు మండలంలోని గ్రామాల వారీగా రైతులకు ఇచ్చిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు రైతులు చెల్లించిన డీడీలు ప్రతి గ్రామంలో ప్రతి నెల వచ్చే ఆదాయ వివరాలు వర్షాలవల్ల విరిగిన విద్యుత్ స్థంభాలు కొత్తగా ఏర్పాటు చేసినవి సబ్‌స్టేషన్లకు వచ్చిన నిధులు వాటి వినియోగ వివరాలు ప్రతి యూనిట్‌కు వసూలు చేస్తున్న చార్జీల సమాచారం ఇవ్వాలని కోరారు. కానీసంబంధిత అధికారుల నుండి సమాచారం అందకపోవడంతో 02.02.2022న జిల్లా డిఈ విద్యుత్ శాఖ మక్తల్ కి అప్పీల్ చేశారు. అయితే అక్కడి నుండీ సమాధానం రాకపోవడంతో రాష్ట్ర సమాచార కమిషన్‌కి ఫిర్యాదు సమర్పించారు. దీనిపై స్పందించిన రాష్ట్రసమాచార కమిషన్ తేదీ27.10.2025 ఉదయం10:30 గంటలకువిచారణకు హాజరు కావాలని నారాయణపేట జిల్లా డిఈ ఊట్కూరు ఎఈలకు నోటీసులు జారీ చేశారు. ఈ విషయాన్ని పరిరక్షణ ఐక్య వేదిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు కొనింటి నర్సిములు తెలియజేశారు.

## పత్తికి మద్దతు ధర రూ.10వేలు ప్రకటించాలి

**ఊట్కూర్, అక్టోబరు 24 ప్రభాతవార్త :** పత్తి పంటకు క్వింటాలుకు రూ.10,000 మద్దతు ధరను ప్రకటించాలని సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో పత్తి సాగు చేసిన రైతులుఅతివృష్టి కారణంగా తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెరిగిన ఎరువులు, పురుగుమందుల ధరలతో పాటు వాతావరణ ప్రతికూలతల వల్ల రైతుల పెట్టుబడులు పెరిగి, దిగుబడులు తగ్గాయని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం నాణ్యత ప్రమాణాల పేరుతో తక్కువ ధరలకు పత్తిని కొనుగోలు చేయడంతో రైతులు పత్తి తీత కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఎకరాకు 25 నుండి 30 వేల రూపాయల ఖర్చు వస్తున్నప్పటికీ, ఒకటి లేదా రెండు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత మార్కెట్ ధర రైతులకు సరిపడదని, కనుక పత్తి క్వింటాలుకు రూ.10,000 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అతివృష్టి వల్ల నష్టపోయిన పత్తి రైతులకు ఎకరాకు రూ.25,000 ఆర్థిక సహాయం అందించాలన్నారు. పత్తి పంటకు గిట్టుబాటు ధర కల్పించడం అంటే రైతును రక్షించడం అవుతుంది,” అని మహేష్ గౌడ్ అన్నారు.